
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శనివారం 11 జనవరి 2025



బిట్రగుంట : కొండబిట్రగుంటలో

కావలి : బృందావనం కాలనీలో..

నెల్లూరు రూరల్ : నృసింహ కొండపై

నెల్లూరు : రంగనాథుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



నెల్లూరు : ఉత్తర ద్వారం నుంచి వెలుపలికి వస్తున్న రంగనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



రాపూరు : పెంచలకోనలో స్వర్ణ గరుడుడిపై కొలువుదీరిన నృసింహుడు



మోక్షప్రదాతా..
మోహన రంగా

ముక్కోటి నాడు మోక్షద్వారం నుంచి శ్రీ రంగనాథుని దర్శించుకోవ డానికి తల్పగిరి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వణికించే చలిని సైతం లెక్కచేయకుండా ఉత్తర ద్వార దర్శనం కోసం వేకువజాము నుంచే బారులుతీరారు. వైకుంఠ ద్వారంలో శ్రీవారు దర్శనమివ్వగానే గోవింద నామ స్మరణతో స్తుతించారు. మా కష్టాలు ఈడేర్చి మమ్మేలు స్వామీ..! అంటూ శ్రీమన్నారాయణుడిని వేడుకున్నారు.

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- ఉత్తర ద్వారంలో శ్రీహరి దర్శనం
- కిటకిటలాడిన ఆలయాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైష్ణవాలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి, మూలాపేట వేణుగోపాల స్వామి, పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి, వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. బుచ్చి కోదండరామస్వామి ఆలయం, ఆత్మకూ రు అళఘనాథస్వామి ఆలయం, కావలి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తల్పగిరి రంగనాథస్వామిని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడం, ముక్కోటికి భక్తులను కరుణిస్తూ వరుణదేవుడు చిరుజల్లులు కురిపించడంతో ఆహ్లాదకర వాతావరణంలో భక్తులు దేవదేవుని దర్శించుకున్నారు. పలుచోట్ల వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

'గణతంత్ర'ం ఘనంగా నిర్వహించాలి

- అందుకు పటిష్ట ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు (కలెక్టరేట్) జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : 76వ గణతంత్ర దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ కవాతు మైదానం పరిసరాలను పరిశుభ్రంగా పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే శకటాలను అందంగా, విజ్ఞానదాయకంగా తయారు చేసి ప్రదర్శించాలన్నారు. పోలీస్, సాయుధ దళాలు, ఎన్‌సీసీ సంయుక్తంగా కృషి చేసి కవాతు ప్రదర్శనలు ఇవ్వాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేవిధంగా నిర్వహించేందుకు విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు అందించే మెరిట్ సర్టిఫికెట్లకు తగు ప్రతిపా దనలను నిర్ణీత సమయంలోగా పంపాలని ఆదేశిం చారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, డీఆర్ఓ ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీవో అనూష, డీఈవో ఆర్.బాలాజీ రావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీఆర్‌డీఏ, హౌసింగ్, ఏపీఎంఐపీ పీడీలు నాగ రాజకుమారి, వేణుగోపాల్, శ్రీనివాసులు, డీటీసీ చందర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీసీఓ గురప్ప, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈలు దేశ్‌నాయక్, గంగాధర్, వరప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సులు నడుపుతారా!?
అయితే, రండి.. అనుమతులిస్తాం

ఔత్సాహికులకు కలెక్టర్ పిలుపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పరిధిలో ప్రైవేటు సిటీ బస్సులు నడిపేందుకు ఆసక్తిత ఉన్నవారు ముందుకు వస్తే వెంటనే అనుమతులు ఇస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రాంతీయ రావాణా అథారిటీ సమావేశంలో నగర పరిధిలో నడిపేందుకు 30 సిటీ బస్సులకు పర్మిట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంతోపాటు రూరల్ పరిధిలో ఇప్పటికే అనుమతి ఉన్న 7 రూట్లలో, నూతనంగా అనుమతి కోరిన మరో 7 రూట్లలో ప్రైవేటు బస్సులు తిప్పుకునేందుకు వచ్చిన దరఖాస్తులను జిల్లా కమిటీ ఆమోదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ కూడా ప్రైవేటుతో పోటీ పడి నగర సర్వీసులు నడపాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు విభాగాలు అంతిమంగా ప్రజలకు సేవ చేసేందుకు పోటీ పడాలని కోరారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ చందర్, ఆర్టీవో సిరి చందన, జిల్లా ప్రజా రవాణా అధికారి మరళీబాబు, ఎంవీఐ బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జల్ జీవన్' పునఃప్రారంభం



సోమశిల జలాశయం

- పల్లెల్లో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ లక్ష్యం
- సోమశిల, కండలేరు, రాళ్లపాడు జలాశయాల ద్వారా నీటి కేటాయింపులు
- కొన్ని పనుల రద్దు.. కొత్తవాటికి ప్రతిపాదనలు

నెల్లూరు (జడ్పీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జల్‌జీవన్ పథకం పనులను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తోంది. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తూ సోమశిల, కండలేరు జలాశయాల్లోని నీటిని గ్రామీణ ప్రజలందరికీ అందించేలా ప్రణాళికలను అధికారులు రూపొందిస్తున్నారు. 2022లో జల్‌జీవన్ మిషన్ పనులు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలన్న లక్ష్యంతో రూ.598 కోట్లతో 3,060 పనులను అప్పట్లో మంజూరు చేశారు. స్థానికంగా ఉన్న వాటర్‌ట్యాంకులు, నీటి పథకాల నుంచి ప్రతి ఇంటికి కొళాయిలు ఏర్పాటు చేసేలా పైపులైన్ల నిర్మాణం, బోర్లు వంటి పనులను కొంతమేర పూర్తి చేశారు. దాదాపుగా రూ.169 కోట్లతో 1,200 పనులను అప్పట్లో అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఆ తర్వాత వైసీపీ హయంలో పథకం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. అసలు పథకం ఉందో లేదోనన్న అనుమానం గ్రామీణుల్లోనూ నెలకొంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జల్‌జీవన్ పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో పథకం పునఃప్రారంభానికి ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో తాగునీటి పథకాలు వేసవిలో అడుగంటిపోయి నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు ఉన్నందున జిల్లాలో అందుబాటులో ఉన్న జలాశయాల నుంచి తాగునీటి సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్

- మిగతా 6లో

ఇంటర్ కళాశాలలకు
నేటి నుంచి సెలవులు

నెల్లూరు (విద్య), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు శనివారం నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● కొత్త కాలేజీలకు..


జిల్లాలో నూతనంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయదలచుకున్న యాజమాన్యాలు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మరో ప్రకటనలో ఆర్ఐఓ కోరారు. గతంలో ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు ఉండగా, దీనిని జనవరి 31వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. రెన్యువల్, అదనపు సెక్షన్స్, కోర్సులు, షిఫ్టింగ్, పేరు, మేనేజ్‌మెంట్, కోర్సుల మార్పు, కాలేజి పునఃప్రారంభం వంటి వాటికి ఫిబ్రవరి 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

● నామినల్ రోల్స్ సరిచూసుకోండి!

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజర వుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను కళాశాలల లాగిన్‌లో ఉంచామని, తప్పులేమైనా ఉంటే ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సంప్రదించాలని ఆర్ఐఓ తెలిపారు. మీడియం, ద్వితీయ, భాష, విద్యార్థి, తల్లి ఆధార్ మార్పు, జెండర్ మార్పులను తగిన ఆధారాలతో ఆర్ఐఓను సంప్రదించి సరిచేసుకోవచ్చున్నారు. తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకునేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పండక్కి ఊరెళుతున్నారా..

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇంటికి రక్ష



దొంగలతో జాగ్రత్త!

- విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో దాచాలి
- అప్రమత్తంగా ఉంటే ఆనందంగా సంక్రాంతి

నెల్లూరు(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ. చదువు, వృత్తి, ఉద్యోగం, వ్యాపారాల కోసం ఎక్కడెక్కడి నుంచో పట్టణాలకు వచ్చి నివసించే వారంతా ఈ పండక్కి సొంతూరు వెళుతుంటారు. ముఖ్యమైన పండుగకుతోడు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో ఎక్కువ మంది స్వస్థలాలకు, చుట్టాల ఇంటికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు పల్లెలకు పయనమయ్యారు. అయితే ఏటా ప్రజలు పెద్ద పండుగ సందడిలో ఉండగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. తాళం వేసిన ఇళ్లను దోచేస్తూ వాళ్లూ 'పండగ' చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు ఇంటికి తాళం వేసుకొని సొంత ఊర్లకు వెళ్లే ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ప్రయోజనం

ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూర్లకు వెళ్లే ప్రజలు పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలు అరికట్టవచ్చని పోలీసులు చెబుతున్నారు.

- స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి.
- మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది.
- ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది.



ఆన్‌లైన్‌లో ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ దరఖాస్తు చేసుకునే ప్రొఫార్మా

ఇలా వినియోగించాలి

ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు తిరిగి వస్తారు అన్న వివరాలు అందులో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునే అవకాశం ఉంటుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



దొంగతనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాము. పోలీసు సిబ్బంది కూడళ్లలో, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఆటోలకు మైక్‌లను ఏర్పాటు చేసి జాగ్రత్తలను తెలియజేస్తున్నాము. పండుగలకు సొంతూర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి.

- జీ కృష్ణకాంత్, ఎస్పీ

కార్పొరేషన్‌లో సంక్రాంతి సంబరం

నెల్లూరు(సిటీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి ముందస్తు వేడుకలను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ పాల్గొని భోగి మంటను వెలిగించారు. ఉద్యోగులు రంగవల్లులతో కార్యాలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. కోలాటం ఆడుతూ, గొబ్బి పాటలు పాడుతూ, హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. గంగిరెద్దుల నృత్యాలు, డీజేపాటలతో కార్యాల యంలో సందడి నెలకొంది.



భోగి మంట వెలిగిస్తున్న మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ, అధికారులు

● ఫ్లెక్సీలను తొలగించండి

నగరంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని కమిషనర్ సిటీ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. 7వ డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్ల పై అనధికారికంగా ఉన్న ఫ్లెక్సీలన్నిటినీ తీసేయాలని సూచించారు. సిటీ ప్లానింగ్ సెక్రటరీకి, ఫ్లెక్సీలు తొలగించని సచివాలయ అడ్మిన్లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. తాగునీటి ట్యాంకుల్లో నీటి నాణ్యతను పరిశీలించారు.

రంగడి ఆలయ పూర్వవైభవానికి కృషి

● దేవదాయ శాఖ మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఎంతో ప్రాశస్త్యం గల తల్పగిరి రంగనాథస్వామి ఆలయ పూర్వవైభవానికి కృషి చేస్తానని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆయన రంగనాథస్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రికి ఆలయ వర్గాలు సాదర స్వాగతం పలికాయి. పూజల అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. తర్వాత మంత్రి మాట్లాడుతూ రంగనాథస్వామి ఆలయానికి రకరకాల రంగులు వేశారని, వీటిని తొలగించి గతంలో ఉన్న పురాతన రాతికట్టడంగానే ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. మంత్రి నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డితో చర్చించి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గర్భాలయం లోనూ కొన్ని పనులు చేయించాలని గుర్తించామన్నారు. ముక్కోటి ఏకాదశి నాడు తమ తల్లిపేరుతో కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా ఉత్సవాల్లో పాల్గొనడం మహదానందంగా ఉందని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ప్రగతి చక్రం.. ప్రస్థానం

ఎర్రబస్సు... ఆర్టీసీకి ఒకప్పటి ముద్దుపేరు. అప్పట్లో బస్సులూ అలాగే ఉండేవి. కాలానుగుణంగా రంగులు, రూపం మారినా అదే పరుగు, ఆగని ప్రయాణం. రోజూ లక్షలాది మందిని గమ్యం చేర్చే అందరి రథం. పల్లెల నుంచి పట్టణాల వరకు అన్ని ఊళ్లను పలకరించే సాధనం. నిజాం కోడలి ఔదార్యంతో పురుడు పోసుకుని లక్షలాది మంది ఉద్యోగులకు ఉపాధినిస్తూ ప్రజా రవాణాలో మేటిగా పరిఢవిల్లుతున్న ఆరు చక్రాల ఆయిల్ బండి. కాలానుగుణంగా మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ఇప్పటికీ ఆర్టీసీ ప్రజల మన్ననలు పొందుతోంది. జిల్లాలో ఆర్టీసీ సేవలు ప్రారంభమై 67 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



- 1958లో ఏపీఆర్ ఆర్టీసీగా రూపాంతరం
- 1973లో నెల్లూరు డిపో ఏర్పాటు
- అంచెలంచెలుగా ఎదిగి.. ఇప్పుగా పతనావస్థకు!
- పల్లెల్లో కనిపించని ప్రగతి చక్రాలు
- నేడు ఆర్టీసీ వ్యవస్థాపక దినోత్సవం



సందర్భం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : దేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1932లో నిజాం నవాబుల పాలనలో ప్రజా రవాణా బస్సులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ప్రభుత్వ ఏలుబడిలో మరింత వృద్ధి చెంది మహావృక్షంగా ఎదిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ యాక్ట్ 1950 ప్రకారం 1958, జనవరి 11వ తేది ఏర్పడింది. అంటే ఆర్టీసీ బస్సులు రాష్ట్రంలో, మన జిల్లాలో అడుగు పెట్టేందుకు బీజం పడిన రోజు అప్పుడన్నమాట. 1972లో నెల్లూరు జిల్లాలో మొదటిగా సుమారు 50 బస్సులను నడిపారు. 1973లో అధికారికంగా నెల్లూరు డిపోను ప్రకటించి ఒంగోలు కేంద్రంగా జిల్లాలో బస్సులను తిప్పేవారు. మొదట్లో దూర ప్రాంతాలకు మాత్రమే బస్సు సర్వీసులు నడిచేవి. 1987లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామరావు ప్రైవేటు బస్సుల సర్వీసులను జాతీయం చేయడంతో పల్లెలకూ బస్సుల అడుగులు పడ్డాయి. అప్పటి నుంచి ఆర్టీసీ ప్రస్థానం సాగుతూనే ఉంది. 2020లో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసింది. అయితే కార్మికులు మొదట్లో తాము ప్రభుత్వ ఉద్యోగులం అయ్యామని ఆనంద పడ్డారు. కానీ ఇప్పుడు తమను ఎందుకు ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారని మథనపడిపోతున్నారు.

● 1987లో ప్రైవేటు బస్సుల జాతీయం

1972 నుంచి జిల్లాలో ఆర్టీసీ బస్సులు నడుస్తున్నా అప్పట్లో ప్రైవేటు బస్సుల ఆధిపత్యం అధికంగా ఉండేది. దీంతో ఆర్టీసీ సంస్థ దూర ప్రాంతాలకు మాత్రమే బస్సులను నడిపేది. 1987, ఫిబ్రవరి 19వ తేదీన అప్పటి ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్రంలోని ప్రైవేటు బస్సుల సంస్థలను జాతీయం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదే సంవత్సరం ఏప్రిల్‌లో పూర్తిగా ప్రైవేటు బస్సుల షెడ్యూల్‌ను జాతీయం చేస్తూ మరో నిర్ణయం తీసు కున్నారు. అప్పటి నుంచి ఆర్టీసీ బస్సులు పల్లె ప్రాంతాలకు వెళ్లడం అధికమైంది. అయితే జిల్లాలో అప్పట్లోనూ ఉదయగిరి ప్రాంతానికి చెందిన పెద్దరెడ్డిపల్లి, పామూరు ప్రాంతానికి చెందిన కంచాలదిన్నె ప్రాంతాలకు మాత్రం ప్రైవేటు బస్సులు నడిచేవి.

● 1994లో నెల్లూరు రీజియన్ ప్రారంభం

జిల్లాలో 1972 నుంచి డిపోలు ఆవిర్భావం జరుగుతున్నా అప్పుడు ఒంగోలు కేంద్రంగానే ఆర్టీసీ బస్సుల ఆపరేటింగ్ జరిగేది. 1994లో నెల్లూరు రీజియన్‌ను ఏర్పాటు చేసి రీజియన్‌కు మేనేజర్‌ను నియమించారు. రీజియన్ మొదటి ఆర్ఎంగా 1994, మే 23వ తేదీన ఎంవీ. నాగవేం దర్‌రావు బాధ్యతలు చేపట్టా రు. ఇప్పటివరకు 18 మంది ఆర్ఎంలుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం 19వ జిల్లా ప్రజారవాణా అధికారిగా ఎం మురళీ బాబు కొనసాగుతున్నారు.

● ఇప్పటి పరిస్థితులు

2020, జనవరి 1వ తేదీ నుంచి ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించారు. జిల్లాల విభజన తర్వాత నెల్లూరు రీజియన్‌కు ఏడు డిపోలు మిగిలాయి. గూడూరు, సూళ్ళూరుపేట, వాకాడు, వెంకటగిరి డిపోలు తిరుపతి జిల్లాకు కేటాయించగా, కందుకూరు డిపోను నెల్లూరుకు కేటాయించారు. రీజియన్‌లో ప్రస్తుతం 2500 మందికిపైగా కార్మికులు, 630 బస్సులు, 600 సర్వీసులు నడుస్తున్నాయి. రోజుకు 1.5 లక్షల మంది ప్రయాణిస్తుండగా, రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రాబడి రీజియన్‌కు అందుతోంది.

పల్లెలకు తగ్గిన ఆదరణ

2000 సంవత్సరం ముందు ఆర్టీసీ బస్సులు అంటే పల్లె ప్రాంతాల్లో ప్రజలు ఎంతో ఆదరణ చూపేవారు. పల్లెలకు వెళ్లే బస్సులు వంద శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీతో ప్రతి ట్రిప్పు నడిచేవి. అయితే, 2000 సంవత్సరం నుంచి పల్లె ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఆటోల సంఖ్య పెరగడం, ప్రైవేటు వాహనాలు రావడంతో ప్రజలు త్వరిత గతిన ప్రయాణం చేందుకు మక్కువ చూపారు. బస్సుల మెయిన్‌టెన్స్‌కు కూడా డబ్బులు రావడం లేదని భావించిన అధికారులు బస్సుల ట్రిప్పులను తగ్గించుకుంటూ వచ్చి తర్వాత అనేక పల్లెలకు పూర్తిగా బస్సులను రద్దు చేశారు.

డిపోల ఏర్పాటు ఇలా

డిపో	సంవత్సరం
నెల్లూరు-1	1973
కావలి	1978
ఆత్మకూరు	1983
గూడూరు	1985
నెల్లూరు-2	1987
వెంకటగిరి	1987
రాపూరు	1988
వాకాడు	1994
ఉదయగిరి	1994
సూళ్లూరుపేట	1999

● 2009 నుంచి టిమ్ మిషన్లు

ఆర్టీసీ ఆరంభం నుంచి సాధారణ టికెట్లను చేతితో చించి పంచ్ చేసి కండక్టర్లు ప్రయాణికులకు అందజేసేవారు. మారుతున్న టెక్నాలజీ ఆధారంగా కండక్టర్లకు టిమ్ మిషన్లు అందించాలని కార్మిక యూనియన్లు ఆర్టీసీ యాజమా న్యంను కోరాయి. అప్పటికే కర్ణాటకలో టిమ్ మిషన్లు వినియోగంలో ఉండటంతో అధికారులు, యూనియన్ నాయకులు కమిటీగా వెళ్లి పర్యవేక్షించారు. వారిచ్చిన నివేదిక ప్రకారం 2009 నుంచి నెల్లూరు రీజియన్‌లోని ఆర్టీసీ బస్సుల్లో టిమ్ మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మరింత టెక్నాలజీ కలిగిన ఎంటీఎస్ మిషన్లు బస్సుల్లో ఉన్నాయి. ఇటీవల ఆర్టీసీ సంస్థ మరో అడుగు ముందుకు వేసి టిమ్ మిషన్ల ద్వారా ఆన్‌లైన్ పేమెంట్లను అందుబాటులోకి తెచ్చింది.

'జల్ జీవన్' పునఃప్రారంభం

(5వ పేజీ తరువాయి)


అధికారులు పథకం పునఃప్రారంభానికి చర్యలు చేపడుతున్నారు. సోమశిల జలాశయం నుంచి 23 మండలాలు, కండలేరు జలాశయం నుంచి 8 మండలాలు, రాళ్లపాడు జలాశయం నుంచి 5 మండలాలకు తాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం అవసరమైన మంచినీటిని జలాశయాల్లో కేటాయించాలని నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు పంపారు. సోమశిలలో 1.12 టీఎంసీ, కండలేరులో 0.48 టీఎంసీ కేటాయింపునకు దాదాపు ఆమోదముద్ర లభించింది. జలాశయాల నీటిని స్థానికంగా ఉన్న ఓ ప్రాంతానికి తరలించి అక్కడ నుంచి ఆయా మండలాల్లోని గ్రామాలకు ట్యాంకుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నారు.

● 1,706 పనుల అప్పగింత

గత ప్రభుత్వంలో పూర్తిగా నిలిపివేసిన పనుల్లో అధిక భాగం రద్దు చేసి వాటిని గ్రిడ్‌కు అప్పగిస్తున్నారు. మొత్తం 3,060 పనుల్లో 1,859 పెండింగ్‌లో ఉండగా వాటిలో 153 పనులు మాత్రమే మరలా ప్రారంభించేందుకు అవకాశం ఉందని అధికారులు లెక్క తేల్చి మిగిలిన 1,706 పనులను గ్రిడ్‌కు అప్పగించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మార్పు, చేర్పులతో పథకం అమలుకు శ్రీకారం చుట్టడంతో అందుకనుగుణంగా కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

నేడు వడ్డెర ఓబన్న జయంతి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆనంద్ జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. వడ్డెర కుల ప్రజలు, ప్రజాప్రతి నిధులు పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్

● జయప్రదం చేయండి

కలెక్టరేట్‌లో జరిగే ఓబన్న జయంతి సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభు త్వం ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించడం హర్షదాయకమన్నారు. వడ్డెరలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన కూట మి ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1500 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సింహ గిరి, ఓసీసీఐ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి రమణయ్య, నాయకులు బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, తిరుపాలు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

8 గంటల పనివిధానం అమలు చేయాలి

● సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు నరేంద్ర

నెల్లూరు (వైద్యం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు 8 గంటల పని విధానం తప్పనిసరిగా అమలు చేయాలని సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు నరేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కార్మిక విధానాలపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన విద్యుత్ చార్జీల భారం మోపుతోందని, వెంటనే ఆ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, రెహానా బేగం, మోహన్‌రావు, పెంచలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు నరేంద్ర

ఓపీలకే పరిమితం

- సుదీర్ఘ సెలవులో గైనకాలజిస్టు
- నిరుపయోగంగా ఆపరేషన్ థియేటర్
- 6నెలలుగా ఒక్క ఆపరేషన్ జరగని వైనం
- ఉలవపాడు ఆస్పత్రిలో ఇదీ దుస్థితి

ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం





నిరుపయోగంగా ఉన్న పురిటి బిడ్డల వార్మర్ బాక్స్‌లు

ఉలవపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్య కేంద్రంలో గైనిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ (ఎండీ), చిన్నపిల్లల వైద్య నిపుణులు, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్టు వైద్యులు ఉన్నారు. ఆధునిక సదుపాయాలు ఉన్న ల్యాబ్, డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్, పుట్టిన బిడ్డలకు వెచ్చదం ఇచ్చే వార్మర్ బాక్స్‌లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఉన్నాయి. ఇన్ని ఉన్నా ఇక్కడ కేవలం ఓపీ సేవలు కింద జ్వరాలు, బీపీ, షుగర్లు సంబంధించిన సేవలు మాత్రమే అందుతున్నాయి. ఆసుపత్రిలో కాన్పులు, సిజేరియన్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదు. మత్తు డాక్టర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉన్నా పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

దీర్ఘకాలిక సెలవుల్లో వైద్యులు

గతేడాది ఏప్రిల్‌లో వచ్చిన గైనకాలజిస్టు సుస్మిత కొన్ని అనివార్య కారణాలతో 6నెలలకే దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. ఆమె తిరిగి వస్తారనే నమ్మకం లేకపోవడంతో మరో గైనికాలజిస్టుని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. అదే బాటలో మాస్టర్ ఆఫ్ డ్రగ్స్ వైద్య నిపుణులు (ఎండీ) డాక్టర్ సౌందర్య 2 నెలలు సెలవులపై వెళ్లారు. అదేవిధంగా ఈ ఏడాది జనవరిలో విధుల్లో చేరిన జనరల్ సర్జన్ వైద్యులు దినేష్ ఉన్నత విద్య కోసం వెళ్లారు. దంతవైద్యులు అస్ఫాన్ బేగం విధులు నిర్వహిస్తున్నారు.



మధ్యాహ్నం డ్యూటీ డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న రోగులు

సెలవులు పెట్టినా పూర్తి జీతం....

విధులకు సెలవులు పెట్టి వెళ్లిన గైనకాలజిస్టు సుస్మిత 6 నెలలు, జనరల్ మెడిసిన్ వైద్యులు సౌందర్య 2నెలలు పూర్తిస్థాయిలో జీతం అందుతున్నాయి. వారు విధులకు రాక.. ఇతర వైద్యులను పోస్టుల్లో చేరనీయక చివరికి.. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

నిరుపేద గర్భిణులకు అవస్థలే..

ప్రతి గ్రామంలోని నిరుపేద కుటుంబాల్లోని మహిళలకు గర్భం దాల్చితే ఉలవపాడు సీహెచ్‌సీకే వస్తారు. సంబంధిత వైద్యులు లేకపోవడంతో కాన్పుల సమయంలో నర్సులు, వైద్య సిబ్బంది కందుకూరు, ఒంగోలు, కావలి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. రాత్రివేళ ఎమర్జెన్సీ కాన్పులు, ఇతర అత్యవసర చికిత్స కోసం వస్తే వైద్య సిబ్బంది నిర్మోహమాటంగా 108 పిలుస్తాం ఒంగోలు రిమ్స్‌కు వెళ్లండని డ్యూటీ నర్సులు చేతులు దులుపుకుంటున్నారు.

విద్యుత్ శాఖలో ముగ్గుల పోటీ

నెల్లూరు (జడ్పీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని విద్యుత్ భవన్‌లో శుక్రారం మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు ఎస్ఈ విజయన్ బహుమతులు అందజేశారు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. పోటీలో ఎక్కువ సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలచంద్ర, శ్రీధర్, పరంధామయ్య, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రచయితల సంఘం ఆధ్వర్యంలో...

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : మాగుంట లేఅవుట్‌లోని ఓ పాఠశాలలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగి మంట వేసి, కృష్ణుడికి ప్రసాదాలు నివేదించి, కోలాటంతో సందడి చేశారు. కవితలు, పద్యాలు వినిపించారు. సంఘం అధ్యక్షురాలు సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, అరుణ, నజ్మ, సుందరి, హర్షవర్ధిని, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

● సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టంగా చదవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే శోభారాణి సూచించారు. శుక్రవారం నెల్లూరులోని డీకే కళాశాలలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇష్టంగా విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో శ్రీనివాసులు, కళా శాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణరావు, సైకాలజిస్టు సీహెచ్ రమేష్‌బాబు, వీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



పొగమంచు.. నిండా ముంచు!

శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగ మంచు కమ్మేసింది. దీంతో దినసరి కూలీ పనులకు వెళ్లే వారు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. చలి తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

బాలల సంరక్షణ కేంద్రాలకు

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నెల్లూరు (హరనాధపురం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా ప్రొబేషన్ అధికారి కాసిం దొర అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఏడు అనాథ బాలల సంరక్షణ కేంద్రాలను ఆయన జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్‌తో కలిసి తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా సంరక్షణ కేంద్రాలు నిర్వహించరాదన్నారు. సురేష్ మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాల్లో అన్నీ వసతులు ఏర్పాటు చేయాలని, తరచూ తనిఖీలు నిర్వహిస్తుంటామని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సమత, సుమలత, మంజుల పాల్గొన్నారు.

రహదారులపై గుంతులు

ఉదయగిరి పట్టణంలోని హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సోంపల్లివీధి సమీపాల్లో ప్రధాన రహదారులపై గుంతలు ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువలపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకల మూతలు నాసిరకంగా ఉండడంతో వాహన రాకపోకలకు ధ్వంసమై గుంత ఏర్పడింది. అటుగా రాకపోకలు సాగించే విద్యార్థులు, వాహనదారులు ఆ గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



నకిలీ వస్తువులపై విజిలెన్స్ దాడులు

- రూ.26 లక్షల సరుకు స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని గోదాములపై దాడి చేశారు. లైసెన్స్, బిల్లులు లేకుండా నిల్వ ఉంచిన నకిలీ సిగరెట్లు, డిటర్జెంట్లు వంటి సుమారు రూ.26 లక్షల సరుకు స్వాధీనం చేసుకున్నారు.



బిల్లులు లేకుండా విక్రయాలకు సిద్ధంగా ఉంచిన స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

- రూ.6.63 లక్షల విలువ చేసే 3900 గోల్డ్ ఫ్లాక్ సిగిరెట్ ప్యాకెట్లు, రూ.45 వేల విలువ చేసే 4500 ఏరియల్ సర్ఫ్ ప్యాకెట్లు, రూ.11520 విలువ చేసే 1152 ఏరియల్ లిక్విడ్ షీట్స్, రూ22800 విలువ చేసే 2280 టైడ్ డబుల్ పౌడర్ షీట్స్ కలిపి మెత్తం రూ.7.42 లక్షల విలువ చేసే వస్తువులను సీజ్ చేశారు. బాధ్యుడైన రాజమండ్రి టౌన్‌హాల్ రోడ్డుకు చెందిన గుండు లక్ష్మణ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
- ఎలాంటి లైసెన్స్, బిల్లులు లేకుండా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.2.70 లక్షల విలువ చేసే 600 పెట్టెల కాప్‌చూర్ ఫ్రెష్ బాక్సులు, రూ.16.20 లక్షల విలువ చేసే 3600 ప్లాన్ ఫ్రెష్ ఫిల్టర్ బాక్స్‌లు కలిపి మొత్తం రూ.18.90 లక్షల విలువ చేసే వస్తువులను సీజ్ చేశారు. అందుకు బాధ్యుడైన నగరంలోని లక్ష్మీపురానికి చెందిన శ్రీరామ్ శ్రీధర్‌పై జీఎస్‌టీ చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కే నరసింహారావు, షేక్ సుభాని, డీసీటీవో కే విష్ణురావు, బీ శాంతిభూషణ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం బోల్తా

సంగం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయ నగర్ రహదారిపై శుక్రవారం ఉదయం చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం బోల్తాపడింది. కడప వైపు నుంచి డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాలు తీసుకొస్తున్న మినీ ట్రక్ వ్యాన్ మార్గ మధ్యంలో అనసూయనగర్ వద్ద రహదారిపై బోల్తా పడడంతో వాహనంలో ఉన్న డ్రమ్ములు కిందపడ్డాయి. వాటిలోని చికెన్ వ్యర్థాలు రోడ్డుపై పడి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనంతరం చికెన్ వ్యర్థాలు తరలించే వారు వాటిని డ్రముల్లో వేసుకుని వేరే వాహనంలో తరలించారు.



అనసూయనగర్ రహదారిపై బోల్తాపడిన చికెన్ వ్యర్థాల వాహనం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఆత్మకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన సంఘటన ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆత్మ కూరు మండలం అప్పారావుపాళెం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన ఉదయగిరి సంపూర్ణమ్మ కుమారుడు యశ్వంత్ (15) పదవ తరగతి చదువుతున్నాడు. అతను శుక్రవారం మిత్రుడితో కలిసి మోటారుబైక్‌పై కొత్తపాళెం వెళుతూ ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడి పోయాడు. దాంతో యశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన యశ్వంత్

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కోటమిట్టలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు... కోటమిట్ట ఎర్రదర్గా వద్ద షేక్ షమీమ్, నజీర్ దంపతులు నివసిస్తున్నారు. వారి చిన్న కుమార్తె రుబీనాకు మూడేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన అంజాద్‌తో వివాహం చేశారు. వారికి కుమారుడు, కుమార్తె కలిగారు. ఈ నెల 9వ తేదీ రాత్రి రుబీనా కుమారుడు హరీజ్ ఇంట్లోని సోఫాలో మూత్రవిసర్జన చేయడంతో నాయనమ్మ గౌసున్నీసా గట్టిగా అరిచింది. ఇది విని రుబీనా బాధపడింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి మేడమీది గదిలో పిల్లల ఊయల కోసం కట్టిన చీరతో ఉరివేసుకొంది. భర్త అంజాద్, కుటుంబ సభ్యులు తలుపులు పగలకొట్టి హుటాహుటిన రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి షమీమ్ ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు మృదేహాన్ని పరీక్షించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7514
వెండి కిలో ధర	రూ. 92,400
వెండి ఒక గ్రాము	రూ.95.40

సోమశిలలో

నీటి నిల్వ

అనంతసాగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సోమ శిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 1,931 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 71.097 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కావలి రూరల్ : స్థానిక గాయత్రీనగర్ శివారులో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు లక్ష్మీకల్యాణి స్థానిక రైల్వేస్టేషన్ సిగ్నల్ డిపార్టుమెంట్‌లో సిగ్నల్ పాయింట్ ఉమెన్‌గా పని చేస్తోంది. భర్త మృతితో ఒంటరిగా ఉంటున్న ఈమె గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి రావడంతో తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లింది. గుర్తు తెలియని దుండగులు బీరువా తాళం తీసి అందు 28 సవర్ల బంగారు ఆభరణాలు దొంగలించినట్లు గుర్తించింది. ఎస్‌ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా 'లూజ్' ఆయిల్ అమ్మకాలు

నిబంధనల పేరుతో 'విజిలెన్స్' మామూళ్లు

విడి విక్రయం..

వసూళ్ల పర్వం

- ఆరు నెలలకోసారి ఇస్తేనే విక్రయాలకు అనుమతులు
- లేదంటే దాడులు.. కేసుల నమోదు
- చక్రం తిప్పుతున్న హోల్‌సేల్ డీలరు

కావలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వంట నూనెల విడి (లూజు) అమ్మకాలపై నిషేదం విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం విడుదలైన ఈ ఉత్తర్వులు ఇప్పుడు అమలు చేస్తూ కొంతమంది అధికారులు వేధిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి ట్యాంకర్లలో లూజ్ ఆయిల్ తీసుకొచ్చి విక్రయించే ప్రధాన డీలర్లను వదిలి స్థానిక వ్యాపారులను వేధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి మామూళ్లు చెల్లించని దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. ఈ మామూళ్లను కూడా జిల్లా కేంద్రం నుంచి ఆయిల్ సరఫరా చేసే హోల్‌సేల్ డీలరే నిర్ణయిస్తారనే ప్రచారం నడుస్తోంది.

● మామూళ్లు ఇవ్వకపోతే...

సార్వత్రిక ఎన్నికల అనంతరం కౌంటింగ్ అయ్యేలోపు విజిలెన్స్ అధికారులు ఆరు నెలల మామూళ్లను అడిగారు. అయితే వ్యాపారులు కౌంటింగ్ అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వంలో బదిలీలు ఉంటాయని వాటిని చూసుకుని మామూళ్లు ఇద్దామని కొందరు భావించారు. కౌంటింగ్ అయిన వెంటనే విజిలెన్స్ అధికారులు కావలికి చేరుకుని మామూళ్లు ఇవ్వని వ్యాపారుల షాపుల్లో తనిఖీలు చేసి రకరకాల కేసులు రాసి వెళ్లారు. వాస్తవంగా లూజ్ ఆయిల్ విక్రయాలను ఆపేస్తే ట్యాంకర్లతో ఆయిల్‌ను సరఫరా చేసే డీలర్ వ్యాపారమే దెబ్బతింటుంది. దీంతో సదరు డీలర్ విజిలెన్స్ అధికారులకు మామూళ్లు ఇప్పించి లూజ్ ఆయిల్ విక్రయాలను ప్రోత్సహిస్తూ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారని వ్యాపారవర్గాలే అంటున్నాయి.



కావలి: వడ్డిపాలెం రోడ్డులో ఉన్న ఆయిల్ మిల్లు

● అసలు అనుమతులు ఉన్నాయా!?

అసలు లూజ్ ఆయిల్ విక్రయాలకు అనుమతులు ఉన్నాయా లేవా అని అధికారులే స్పష్టంగా చెప్పడం లేదు. అనుమతులు లేకుంటే లూజ్ ఆయిల్ ఎందుకు విక్రయిస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అనుమతులు ఉంటే అధికారులు ఎందుకు దాడులు చేస్తున్నారు.. మామూళ్లు ఇస్తే మరలా నుమితి ఎలా అిస్తున్నారని వ్యాపారులు చర్చిం చుకుంటున్నారు. ఈ విషయంలో స్పష్టత లేకపో వటంతో నియంత్రించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేక పోతుంది.

● రెండు విధాలుగా వసూలు

అయితే ఆయిల్ వ్యాపార టర్నోవర్‌ను బట్టి మామూళ్లు తీసుకోవడం లేదని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. కావలిలో టర్నోవర్‌తో సంబంధం లేకుండా చిన్న వ్యాపారుల వద్ద ఆరునెలలకు రూ.20వేలు, పెద్దవ్యాపారుల వద్ద రూ.40 వేలు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. లూజ్ ఆయిల్ సరఫరా చేసే డీలరే వ్యాపారులు కొనుగోలు చేసే ఆయిల్‌ను బట్టి లీటర్‌కు కొంత పెంచి ఆ మేరకు విజిలెన్స్‌కు చెల్లిస్తే తమకు పెద్ద, చిన్న వ్యాపార తారతమ్యాలు లేకుండా విజిలెన్స్ దాడులు లేకుండా పోతాయని మరికొందరు చెబుతున్నారు.

భారం అంతా ప్రజలపైనే!

ఎవరెన్ని మామూళ్లు ఇచ్చినా చివరకు ఆ భారమంతా వినియోగదారులపైనే పడుతోంది. ఈ పండుగ సీజన్‌లో కావలికే సుమారు 15 ట్యాంకర్ల వరకు లూజ్ ఆయిల్ సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఒక్కో ట్యాంకరులో 10-12వేల లీటర్ల ఆయిల్ వస్తోందని చెబుతున్నారు. ఈ ఆయిల్‌ను అధికారికంగా అమ్మాలంటే ప్యాకింగ్ లైసెన్స్ ఉండి ప్యాకింగ్ చేసినట్లు చూపించి బిల్లులు వేయాలి. అలా వేస్తే జీఎస్టీ చెల్లించాల్సి వస్తుందని బిల్లులు లేకుండా అనధికారికంగా అమ్ముతూ వినియోగదారుల నుంచి జీఎస్టీతో కలిపి అదనంగా వసూలు చేస్తున్నారు. వ్యాపారుల నుంచి అధికారులు మామూళ్లు వసూలు చేసే మొత్తం వినియోగదారులపైనే పడుతోంది.

అసలే అదును తప్పే..

ఆపై ప్రతికూల వాతావరణం

- శుక్రవారం కారు మబ్బులు.. తుంపర చినుకుల వర్షం
- ఆందోళనలో మినుము, పొగాకు, శనగ, వరి సాగు రైతులు

కావలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కారు మబ్బులతో తుంపర చినుకులు పడి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావటంతో కావలి డివిజన్‌లోని పొగాకు, మినుము, శనగ పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందారు. ఈ ఏడాది సకాలంలో వర్షం కురువక పోవడంతో మెట్టప్రాంత మండలాల్లో మినుము పంట సాగు చాలావరకు తగ్గిపోయింది. వర్షాలు ప్రారంభమైన తర్వాత పొలాలు ఆరకుండా ఎక్కువ సమయం వానలో పడటంతో పొగాకు, మినుము, శనగ, వరి పంటలు అదునులో వేయలేక ఆలస్యమైంది. అదును తప్పిన పంటల సాగుకు తెగుళ్ల సోకటమే కాకుండా వ్యవసాయ ఖర్చులు పెరిగి పంటల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. వరి పంటలో వెన్ను తీయటంతో దిగుబడి తగ్గుతోందని.ప్రస్తుతం పొట్టపై ఉన్న వరికి వర్షం పడితే గింజ తాలు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మబ్బులు, మసురు వానలతో పొగాకు పంటలో తెగుళ్ల తాకిడికి అధికం కావడం.. పొగాకు ఆకులపై ఉన్న బంక కారి పోయి దిగుబడిలో నాణ్యత తగ్గుతుందని చెబుతున్నారు. శనగ వర్షం పడితే దెబ్బతినే ప్రమాదం ఉంది. ఎలాంటి వర్షాలైనా తట్టుకునే వరి సాగు కూడా వర్షం పడితే నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మొత్తం మీద ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తే గాలిలో దీపంలా వ్యవసాయం పరిస్థితి మారిందని రైతులు చర్చించుకుంటున్నారు.



కొట్టుడుకు వచ్చిన పొగాకు పంట



పందెపురాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడులు

సైదాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాసాగరం పంచాయతీ తూర్పు పూండ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ కాంతికుమార్ మాట్లాడుతూ కోడి పందెం ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని రూ.9,100 నగదుతోపాటు ఒక కోడిని స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదుచేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కుష్ఠు' సర్వే పక్కాగా ఉండాలి

- ఇంటింటికి వెళ్లి రోగులను గుర్తించాలి
- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీ నుంచి చేపట్టే కుష్ఠు వ్యాధి సర్వేను వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్యాధి కారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాల యంలో వైద్యులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ఒక వలంటీర్, ఆశా కార్యకర్తతో కలిసి ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని సూచిం చారు. ఇందుకోసం జిల్లాలో 1879 బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సురేంద్రబాబు, డీఎఫ్‌ఐ టీ అధికారి సతీష్, డాక్టర్ సునీత, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనల దశ దాటని అగ్నిమాపక కేంద్రం

బుగ్గిపాలవుతున్న ఆస్తులు

వెంకటాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటడం లేదు. దీంతో మండలంలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే నెల్లూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి ఆస్తులు బుగ్గిపాలవుతోన్నాయి. విస్తీర్ణ రీత్యా వెంకటాచలం మండలం పెద్దది. కొన్ని గ్రామాలు మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయితే మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేదు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలు నెల్లూరు, పొదలకూరు నుంచి రావాల్సి ఉంది. ఈ వాహనాలు వచ్చేలోగా గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం వచ్చేలోగా ఆస్తులు బుగ్గిపాలవుతోన్నాయి. గతంలో మండలంలో పలు దఫాలు అగ్ని ప్రమాదాలు జరిగి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించిన సందర్భాలున్నాయి. తిరుమలమ్మపాళెం పంచాయతీలోని గాజులపల్లి కోనేరు గ్రామంలో పశువుల పాకకు నిప్పంటుకుని ఏకంగా 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అదే విధంగా పలు గ్రామాల్లో గడ్డివాములకు నిప్పంటుకుని పూర్తిగా బూడిదవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అనేక ఇళ్లు బుగ్గిపాలయ్యాయి. దీంతో ఎంతోమంది నిరాశయులయ్యారు. ఇదే తరహాలో తరచూ అగ్నిప్రమాదాలు జరగడం వల్ల ఆస్తి నష్టాలు జరుగుతూనే ఉన్నాయి.

అగ్ని ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు చేసిన విజ్ఞప్తితో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంసిద్ధత వ్యక్తం చేశారు. అప్పట్లో అధికారులు మండలంలో పర్యటించి సర్వేపల్లి గ్రామంలో కేంద్రం ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు అగ్నిమాపక వాహన సేవలు సకాలంలో అందుతాయని అభిప్రాయపడ్డారు. అయితే అప్పుడే ఎన్నికల కోడ్ అమలులోకి రావడం ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం మాత్రం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు విషయాన్ని పూర్తిగా విస్మరించింది. ఆనాటి నుంచి నేటి వరకు కేంద్రం ఏర్పాటు ఊసేలేదు. దీంతో అగ్ని ప్రమాద బాధితులకు అగచాట్లు తప్పడం లేదు. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో ప్రజల ఆశ మళ్లీ చిగురించాయి. సోమిరెడ్డి తలుచుకుంటే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అత్యంత సులువైన విషయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజల కల నెరవేరుతుందా లేదా కలగానే మిగులుతుందా వేచి చూడాల్సిందే.

16 లోపు సబ్సిడీ రుణాలకు
దరఖాస్తు చేసుకోండి


సంగం: వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో షాలెట్

సంగం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇతర కార్పొరేషన్లలో ఆర్థికంగా వెనుకబడిన వారు సబ్సిడీ రుణాలకు ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో షాలెట్ తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ మండలానికి 44 రుణాలు మంజూరయ్యాయని,ఆసక్తి కలిగినవారు ఏపీ ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

●కలిగిరి: అర్హత కలిగిన లబ్ధిదారులు ప్రభుత్వ రాయితీపై అందించే కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రత్యూష పేర్కొన్నారు. కార్పొషన్‌ల వారీగా బీసీ-30, ఈబీసీ-2, కమ్మ-2, రెడ్డి-3, ఆర్యవైశ్య-1, బ్రాహ్మణ-1, కాపు (చంద్రన్న స్వయం ఉపాధి కింద) -4 వంతున యూనిట్లు మంజూరు అయినట్లు చెప్పారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం, పాస్ ఫొటోలు ఉన్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

●బిట్రగుంట: మండలంంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, కమ్మ బ్రాహ్మణ కులస్థులు కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో సుబ్రమణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కులధ్రువీకరణ, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకంతో పాటు పాస్‌పోర్టు ఫొటోలతో ఏపీవో బీఎంఎంఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

●ఉలవపాడు : బీసీ కార్పొరేషన్, ఇతర కార్పొరేషన్ల (ఎస్సీ, ఎస్టీ తప్ప) ద్వారా సబ్సిడీ బ్యాంక్ రుణాలు పొందేందుకు ఈ నెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వ నమోదు

కలిగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డితో పాటు అయ్యపరెడ్డిపాలెం పొన్నగంటి శ్రీనివాసరావు, క్రాకుటూరు మలినేని శ్రీనివాసులునాయుడు, పోలంపాడు క్లస్టర్ ఇన్‌చార్జ్ కల్లూరి చంద్రమౌళి, కమ్మవారిపాలెం మేదరమెట్ల శ్రీనివాస్‌లు శుక్రవారం రూ.1లక్ష వంతున రుసుం చెల్లించి ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, చీమల తాతయ్య, బాసం నరసింహనాయుడు, గన్నమనేని శ్రీనివాసులు ఉన్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


పబ్లిక్ కొళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీకి నూతనంగా నిర్మించిన తాగునీటి పైప్ లైను, పబ్లిక్ కుళాయిలను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. గత ఎన్నికల సమయంలో కాలనీవాసులు ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నట్లు తెలిపారు. కాలనీలో అన్నిమౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రతిఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. అంతకుముందు కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డీఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, అహ్మద్‌బాషా, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, షేక్ మున్నా, ఫిరోజ్, రూబీ, సలాం, ముచ్చు శ్రీను, గడ్డం మాలకొండయ్య, చుండూరి శ్రీను పాల్గొన్నారు.

రొటేరియన్ దినేష్‌కు జీవిత పోషక (ప్యాట్రన్) సభ్యత్వం


రెడ్‌క్రాస్ జీవిత పోషక (ప్యాట్రన్) సభ్యత్వం స్వీకరిస్తున్న రొటేరియన్ దినేష్

కావలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు చెన్నంశెట్టి దినేష్ రూ.25వేలు చెల్లించి రెడ్‌క్రాస్ జీవిత పోషక (ప్యాట్రన్) సభ్యత్వాన్ని శుక్రవారం ఆర్డీవో, రెడ్‌క్రాస్ అధ్యక్షులు సన్నీ వంశీక్రిష్ణ చేతులమీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. దినేష్ విద్యార్థిగా ఉన్నపుడు తమిళనాడు రాష్ట్ర కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌గా గెలుపొందారని, రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ఉన్నపుడు కావలిలో డయాలిసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. పట్టణంలో వివిధరంగాల ప్రముఖులు, దాతలను జీవితపోషక సభ్యులుగా చేర్పాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆర్డీవోను సత్కరించి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, హరినారపరెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

విట్స్ అధ్యాపకుడు షేక్ రిజ్వాన్‌కు డాక్టరేట్



కావలి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకుడు షేక్ రిజ్వాన్‌కు చెన్నై ఎస్‌ఆర్ఎమ్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ రిజ్వాన్ డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ కాంపాక్ట్ ప్లేనార్ యాంటినాస్ ఫర్ రెటినల్ ప్రాస్థసీస్ అండ్ బోన్ హీలింగ్ అప్లికేషన్స్ అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్‌ను ఇచ్చినట్లు రిజ్వాన్ తెలిపారు. విట్స్ కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య, హెచ్‌వోడి డాక్టర్ స్రవంతి అధ్యాపకులు రిజ్వాన్‌ను అభినందించారు.

పశువైద్యాధికారి చెన్నకేశవులుకు పదోన్నతి

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాచవరం పశువైద్యాధికారి చెన్నకేశవులు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయన్ను తూర్పుగోదావరి జిల్లా చింతూరు పశుసంవర్ధకశాఖ ఏడీగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవులును పశువైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు.

కాపు జేఏసీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా సాయిచంద్

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాపు జేఏసీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా సాకిరి సాయిచంద్‌నాయుడును నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు సూచనలతో కాపులను సంఘటితం చేసి వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని సాయిచంద్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు ఎన్‌సీసీ విద్యార్థిని ఎంపిక

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న కొండవీడులో ప్రారంభం కానున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు వివేకా డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థిని జడ శ్రావ్య ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రావ్యను ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగిమంట వేసి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రగతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, లెర్నింగ్ ట్రీ స్కూల్, ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పట్టు పంచెలు, విద్యారినులు పట్టు లంగాలు ధరించి అలరించారు. భోగి మంటలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు వంటివి ఏర్పాటు చేశారు. చిన్నారులు హరిదాసుల వేషాలు, సంక్రాంతి పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రికెట్, కోలాటం తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు ఎస్ రామ్మోహన్‌రెడ్డి, మేకపాటి శైలజ, డైరెక్టర్ ఎస్ అమరావతి, అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు వేసుకుని సరదాగా నృత్యం చేశారు. విద్యార్థులపై ఉపాధ్యాకులు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, బాలభాస్కర్, బెజవాడ నరేంద్ర పాల్గొన్నారు.


ఆత్మకూరు: పూజలందుకుంటున్న అలఘునాధుడు


ఉదయగిరి: సుద్దబావివీధి సీతారామస్వామి ఆలయంలో పూజలు


సంగంలో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న ఆత్మారాముడు

ఉత్తర ద్వార దర్శనం.. సకల పాప హరణం

● వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ● స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఉదయగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని సుద్ధబావి, బ్రాహ్మణవీధుల్లో ఉన్న శ్రీసీతారామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారము ద్వారా స్వామివారిని దర్శించుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారము ద్వారా స్వామివారిని దర్శించుకుంటే సకల పాపకర్మలు హరించి ఆ దేవదేవుని కరుణా కటాక్షములు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అర్చకులు స్వామివార్లను పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

●దుత్తలూరు: మండలంలోని రెడ్లదిన్నె కొండపై ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. అలాగే నర్రవాడ, నందిపాడు, బ్రహ్మేశ్వరం, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని ఆలయాలలో ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

●ఆత్మకూరు : నియోజకవర్గంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అలఘనాధస్వామి, కన్యకాపరమేశ్వరి, శివాలయం, పంటవీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, హనుమాన్‌జంక్షన్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత అలఘనాధస్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సంగం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా మక్తాపురం, సిద్దీపురంలోని రామాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

●సీతారామపురం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామపురం ప్రధాన వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో శ్రీదేవి భూదేవి సమేత విఠలేశ్వరస్వామిని, పంద్రంగి గ్రామంలోని పాండురంగ విఠలేశ్వరస్వామిని, ప్రాచీన శైవక్షేత్రం సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరిదేవిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●కలిగిరి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు శుక్రవారం ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా గరుడవాహనంపై స్వామివారు ఊరేగుతుండగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

●ఉలవపాడు: స్థానిక వేణుగోపాల స్వామి ఉత్తరద్వార నుంచి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారిని ప్రత్యేక అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులను దర్శనానికి వదిలారు. తహసీల్దారు లావణ్య స్వామివారిని దర్శించుకొనిపూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●కొండాపురం: భీమవరప్పాడు రామాలయంలో దేవతా మూర్తుల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. రాత్రి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. సాయిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి.

●బిట్రగుంట: కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై ఉత్తర ముఖద్వారం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపం నుంచి చేపట్టిన ఆలయ ప్రదక్షిణ అనంతరం ముఖద్వారం వద్ద స్వామివారు, ఉత్తర మండపం వద్ద చిన్న ఉత్సవరులు కొలువుదీరారు. చెంచులక్ష్మీపురం కోదండరామాయలంలో శ్రీరామచంద్రులు శేష వాహనంపై మహాలక్ష్మీ సమేతంగా మహావిష్ణువు ఉత్తర ముఖ ద్వారం గుండా దర్శనం ఇచ్చారు. ఇబ్రహీంపేట రైల్వే లోకో రామమందిరంలో సీతారాములు గజవాహనంపై మహావిష్ణు, లక్ష్మీదేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, పలువురు టీడీపీ నేతలు దర్శించుకున్నారు. స్థానిక టీడీపీ నేత రావి విజయ్‌కుమార్ యాదవ్, మిత్రబృందం భక్తులకు అన్నదానం చేపట్టారు.

●దగదర్తి (బిట్రగుంట): శ్రీరామాపురం పంచాయతీలోని రామాలయంలో శ్రీరామచంద్రమూర్తి మహావిష్ణువు అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మొదట సీతారామలక్ష్మణులకు ప్రత్యేక అభిషేక, పూజలుచేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మెట్టు అమరనాథ్ రెడ్డి, బట్టేపాటి వీరారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

●కావలి టౌన్: స్థానిక బృందావనం కాలనీ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, పాతూరు విష్ణాలయాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొని ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనం కాలనీ ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగులు భక్తులను కనువిందు చేసింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరగగా కుమార్తె అల్లుడుతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని ఉత్తరద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణాలయంలో కూడా ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు.

●జలదంకి: స్థానిక చెన్నకేశవ ఆలయం, బ్రాహ్మణక్రాక వేణుగోపాలస్వామి ఆలయాల్లో తెల్లవారుజామున భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

●కందుకూరు: పట్టణంతో పాటు పరిసర గ్రామాలలోను ముక్కోటి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ముక్కోటి సందర్భంగా దేవతామూర్తుల ద్వారదర్శనం కోసం వేకువజామునుంచే ప్రజలు తలంటుస్నానాలు చేసి నూతన వస్త్రధారణతో బారులుతీరటంతో కోలాహలం నెలకొంది.

పట్టణంలోని స్కంధపురి జనార్దన స్వామి ఆలయంలోని తూర్పురాజగోపుర ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. జనాలు బారులు తీరటంతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే రెవెన్యూకాలనీ కోదండరామాలయం, పెద్దబజారు కోదండరామాలయం, పామూరు రోడ్డులోని రామాలయం, ముదిరాజ్‌పాలెం రామాలయంలలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్‌పాలెంలోని విష్ణుమూర్తి ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలంకరణ చేసి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

●లింగసముద్రం: పెదపవని, చినపవని, లింగసముద్రం, మొగిలిచెర్ల, వీఆర్ కోట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపవని వేణుగోపాలస్వామి, లింగసముద్రం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలు, ఆర్యవైశ్య బజారులోని కోదండరామస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.


కందుకూరు: స్కంధపురి జనార్దనస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు


కావలి టౌన్: బృందావనం కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తదితరులు


జలదంకి: పురవీదుల్లో ఊరేగుతున్న చెన్నకేశవుడు

పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ విషయంపై శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో డీటీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య, ఆనంద్‌మోహన్, నత్తా రామారావు, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాల బ్రహ్మాచారి పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కావలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో షైనేని రవికుమార్ శుక్రవారం కావలిలోని గోవిందమ్మ, చామంతిలకు కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచ్ మేనేజరు నాగరాజుసింగ్, రాంసెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు అళహరి పద్మావతి, కరిష్మా, రావూరి వెంకట్రావు, బీసీ భవన్ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల ఔదార్యం

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయం కృషి దివ్యాంగుల పాఠశాల చిన్నారులకు శుక్రవారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం ఐదు మంచాలు అందజేశారు. ఎన్‌ఆర్‌ఐ ఇన్నమూరి కన్యకా చైతన్య సౌజన్యంతో ఇన్నమూరి నాగాంబికా ప్రసాదు వీటిని పాఠశాలలో ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాచకులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి పర్వదినం సందర్భంగా 1973-34 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి మిత్రబృందంతో కలిసి పట్టణంలోని యాచకులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీతో పాటు అల్పాహారం అందజేశారు. స్థానిక జనార్దన స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ శ్రీరామ రామమూర్తి, పీఆర్ విశ్రాంత డీఈఈ మంచిరాజు మురళి, సందాని బాషా, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, ఆర్.బ్రహ్మానందం, ఆకిలి ఉమ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు


అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు లక్ష్మీ నారాయణ

అల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలో ఎవరైనా కోడి పందేలు, బెట్టింగులు నిర్వహిస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు తప్పవని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంల మండల ఎంపీడీఓ, పోలీసులు, పశువైద్యశాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. కలెక్టరు ఆదేశాల మేరకు మండలానికి ఒక కమిటీ వేశారని వీరు ఎక్కడ పందేలు, బెట్టింగులు నిర్వహించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జంతుహింస చేయరాదన్నారు. అందులో భాగంగా పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, పశువైద్య శాఖ అధికారి, కానిస్టేబుళ్లను కమిటీలో సభ్యులుగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌ఐ వెంకటేశశ్వర్లు, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఉదయగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజ మోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం వివేకానంద జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అలాగే అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు పోటాపోటీగా రంగవల్లికలు వేసి గొబ్బెమ్మలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణంపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 11మద్యం సీసాలు స్వాధీనం

కావలి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, కావలి ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం చలంచర్లలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించారు. అమ్మకాలు చేస్తున్న వేమూరు మాల్యాద్రిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 11మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉలవపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ వెంబడి ప్రమాదకర చెట్లను తొలగించేందుకు శనివారం పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉలవపాడు, భీమవరం, చాకిచర్ల, రామాయపట్నం, అలగాయపాలెం, కరేడు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

రెవెన్యూ సదస్సు అర్జీలను పరిష్కరిస్తాం

● సయ్యద్ ఇక్బాల్, తహసీల్దారు, కందుకూరు



ముఖాముఖి

కందుకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెన్యూ సదస్సుకు వచ్చిన అర్జీలను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసు కుంటామని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు.

? ఫాదర్‌బంగ్లా స్థలాన్ని పరిశీలించారా.

! బుధవారం ఉదయం 9గంటలకే ఉన్నతాధికారులను పరిశీలించి మధ్యాహ్నంలోగా నివేదికలు పంపా లని సబ్ కలెక్టరు నుంచి ఆదేశాలు అందాయి. ఈ ప్రాంతానికి వెళ్లి పరిశీలన చేయటంతో పాటు అవకాశం రికార్డును అధ్యయనం చేసి ప్రాథమిక నివేదికను సబ్ కలెక్టరుకు అందజేశాం.

? స్థలంలో ఏ సమస్యలు గుర్తించారు.

! ఆ స్థలంలో స్కూల్ నడిచిన భవనాలన్నీ సీజ్‌చేసి ఉన్నాయి. ప్రధాన బంగ్లాలో మాత్రం ఓ కుటుంబం నివసిస్తున్నట్లు గుర్తించాం. వారితో మాట్లాడగా ఈ భవనం మాదే అన్నట్లు మాట్లాడారు. ఆమేరకు రాసి ఇవ్వమని అడగటంతో వారు అందుకు ముందుకు రాలేదు. మాకేమీ సంబంధం లేదు ఎవరిదో అయితే మేము ఉంటున్నాం అన్నట్లు మాట్లాడారు.

? అక్రమంగా నివాసం ఉంటే చర్యలు తీసుకోరా.

! సమగ్ర పరిశీలన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

? రెవెన్యూ సదస్సుల అర్జీల పరిస్థితి ఏమిటి

! రెవెన్యూ సదస్సులో వస్తున్న అర్జీలలో అధికశాతం గతంలో వివిధ సందర్భాల్లో వచ్చినవే. ఈ సమస్యలపైనే మళ్లీ ఇస్తున్నారు. వీటిని క్రోడీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

వైభవంగా ముక్కోటి

- వైష్ణవాలయాల్లో భక్తుల రద్దీ
- రంగడి దర్శనానికి అర్ధరాత్రి నుంచే క్యూ


రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని నగరవాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తల్పగిరి రంగనాథ స్వామి ఆలయం మొదలు అన్ని వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారం నుంచి శ్రీమహా విష్ణువును పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో తెల్లవారుజాము 5గంటలకు స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి, ఆండాళ్ అమ్మవార్లకు ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం భక్తుల దర్శనం కోసం అలంకార మండపంలో వేంపు చేశారు. స్వామి వారిని భక్తులు రాత్రి 10గంటల వరకు దర్శించు కున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు దర్శించుకుని పూజలు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సమేతంగా, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి శ్రీవారిని దర్శించు కున్నారు. ఈ ఉత్సవాలను చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

● తొలిసారిగా బాలాజీనగర్ శ్రీరామమందిరంలో రామ చంద్రునికి గరుడ వాహనంపై అలంకారం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శనివారం కూడా ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉభయకర్తగా కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, జ్యోతి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల్లో వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

● నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో ఆదికేశవ స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ రామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు. ● మహాత్మా గాంధీనగర్ కృష్ణమందిరంలో వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస పూజలు జరిగాయి.


బాలాజీనగర్‌లో గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు

● మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం వైభవంగా జరిగింది. భారీ సెట్టింగ్, పుష్పాలంకరణ ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● శబరి శ్రీరామక్షేత్రంలో శ్రీరామచంద్రమూర్తి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేష పూజలు జరిగాయి. చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, చంద్రారెడ్డి, రాజు, తదితరులు పర్యవేక్షించారు.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరం, మాగుంట లే అవుట్ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్ సాహెబ్‌పేట రామాలయంలోనూ వైకుంఠ ద్వారం నుంచి భక్తులు గోవిందుడిని దర్శించుకున్నారు.


నెల్లూరు రూరల్ : మంత్రి నారాయణకు స్వాగతం పలుకుతున్న అర్చకులు


వైకుంఠ ద్వారంలో రంగనాథుని దర్శనం



వేదగిరి క్షేత్రంలో....

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేదగిరి క్షేత్రంలో శుక్రవారం లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున విశేష అభిషేకాల అనంతరం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేతంగా ప్రత్యేక అలంకరణలో పల్లకిపై స్వామి వారు గిరిప్రదక్షిణకు వెళ్లారు. ఆ తర్వాత ఉత్తర ద్వారము నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీనృసింహుడి దర్శనానికి భక్తులు భారీగా నరసింహకొండకు తరలివచ్చారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, సతీమణి రమాదేవీ, కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.


రంగనాథ స్వామి ఆలయంలో ఎస్పీ కుటుంబం


మూలాపేట కోనేరులో తెప్పపై విహరిస్తున్న గంగా, పార్వతి సమేత మూలస్థానేశ్వర స్వామి

మూలస్థానేశ్వరుడికి తెప్పోత్సవం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మూలాపేట కోనేరులో మూలస్థానేశ్వర స్వామికి శుక్రవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. పుష్ప, విద్యుద్దీపాలతో తెప్పను ముస్తాబు చేశారు. గంగా, పార్వతి సమేత మూలస్థానేశ్వర స్వామి ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి తెప్పలో కొలువుదీర్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.





ఉచిత ప్రసాదాల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం) : ముక్కోటి సందర్భంగా రంగనాథ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు శ్రీరామ హనుమాన్ భక్త బృందం భారీగా ప్రసాద వితరణ చేసింది. చీరాల నుంచి డ్రైఫ్రూట్స్ లడ్డూలు తెప్పించి పంచారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ప్రారంభించారు. భక్తబృందం సభ్యులు పాదర్తి బాలాజీ, సాయిబాబా, శ్రీనివాసులు, పెనల మోహిత్, పాదర్తి బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారావు, చిరంజీవి, సాయిరాం పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు

- ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు ● ఆలయాలు కిటకిట


రాపూరు : పెంచలకోనలో బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయా లు కిటకిటలాడాయి. బుచ్చిలోని కోదండరామస్వామి, కల్యాణ వేంకటేశ్వరుడు, వేణుగోపాలస్వామి, జొన్నవాడలోని వరదరాజులస్వామి ఆలయాల్లో ఉదయం 5 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. జొన్నవాడలో ఉదయం వరదరాజస్వామి, బుచ్చిలో రాత్రి కోదండరాముడు గరుడ వాహ నంపై ఊరేగారు. బుచ్చిలో శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేం కటేశ్వరుడు శేష వాహనంపై కొలువుదీరి భక్తులకు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. ఊరేగింపులో కోలాట భజనలు, ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను అలరించాయి. గంగా, కామాక్షి సమేతుడు మల్లికార్జున స్వామి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తరలివచ్చారు. ఉదయం స్వామివా రికి అభిషేకం నిర్వహించి 6 గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించు కునే అవకాశం భక్తులకు కల్పించారు. పెంచల కోన క్షేత్రానికి అనుబంధ ఆలయం అయిన గోనుపల్లి గ్రామంలో ఉత్సవమూర్తులకు గరుడ సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. 10గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం బంగారు గరుడ వాహనంపై పెంచలకోన మాడ వీధులలో ఊరేగింపు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా జరిగింది. భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్ల ఏర్పాటు, అన్నదానం, తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

లక్ష్మీ వేంకటేశ్వరుడి గ్రామోత్సవం

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస లే అవుట్‌లో వెలిసి ఉన్న గోదాదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్‌తో ఉత్తర ద్వార దర్శనం కల్పిం చారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కాయా కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో..

కోవూరు,(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కోదండరామస్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెంచలకోనలో పోటెత్తిన భక్తులు

రాపూరు,(ఆంధ్రజ్యోతి): పెంచలకోనకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు భారీగా


కోవూరు: వీరాంజనేయ స్వామి ఆలయంలో ..


బుచ్చి : వరదరాజస్వామి గరుడోత్సవంలో కోలాటం


పొదలకూరులో గరుత్మంతుడిపై ఊరేగుతున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

- తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

కోవూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం లేని పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నేత రామరాజు మాట్లాడుతూ పేదలందరికీ నివేశన స్థలాలు, రేషన్ కార్డులు కేటాయించాలని, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రదర్శనగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు అక్కడ ధర్నా చేసిన అనంతరం తహసీల్దారు నిర్మలానంద బాబాకు వినతిపత్రం సమర్పించారు.


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

శంబన్ కులస్థులను ఎస్సీలో చేర్చడం సరికాదు

విడవలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు చెందిన శంబన్ కులస్తులను వారి స్వార్థం కోసం ఎస్సీ (దళిత) కులంలో చేర్చడం న్యాయం కాదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సాల్మన్‌రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రామతీర్థం పాతూరులో సుమారు 1400 మంది శంబన్‌లు ఉంటే వారిలో 80 మంది దళిత కులస్తులుగా రెవెన్యూ అధికారులు గుర్తిచ్చారన్నారు. ముదివర్తి, ఊటుకూరులో ఉన్న శంబన్‌లను ఎస్సీలుగా పరిగణిస్తూ అధికారులు జాబితా ప్రభుత్వానికి అందజేశారని తెలిపారు. తప్పులు తడకలుగా అధికారులు రూపొందించిన నివేదికను మళ్లీ విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు సతీష్, ఈదూరు శ్రీధర్, రవికుమార్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న దళితనాయకులు

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు





వెంకటాచలం: విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేస్తున్న ఉషమ్మ, ముత్తుకూరు: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వెంకటాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో శుక్రవారం స్వర్ణభారతి విద్యా మందిర్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ హాజరయ్యారు. విద్యార్థులు సం ప్రదాయ పద్ధతిలో వస్త్రాలను ధరించి అలరిం చారు. భోగి మంటలు వేయడంతో పాటు రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. హరిదాసు వేషంలో విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం ఆక ట్టుకుంది. ఈసందర్భంగా గాలి పటాలను ఎగుర వేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఉషమ్మ మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత, వ్యవస్థాపకులు, పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్ఫూర్తితో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ నేతృత్వంలో ఇలాంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భావితరాలకు ఉపయోగపడేలా సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు.

● ముత్తుకూరు,(ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టులోని అదానీ వరల్డ్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్, జీ.వేణుగోపాల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్‌రంజన్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి మృత్యుంజయ రాం, భద్రతా అధిపతి మేజర్ వెంకటేష్, భాస్కర్‌లు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శోభామిశ్రా ఆధ్వర్యంలో కొత్త మట్టి కుండలలో సాంప్రదాయ వంటకం తయారు చేశారు. రంగోలి నమూనాలు, గాలిపటాలు ఎగరేసే పోటీలు, పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించే జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, పాఠశాల కో ఆర్డినేటర్లు సుమన్, దేవకి, అనీష్, ఉష పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని కనిసిరిపాళెం వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. స్థానికుల సమాచారం మేరకు ఈమె ఈ ప్రాంతంలో కొంతకాలంగా భిక్షాటన చేసుకొంటూ జీవనం సాగిస్తోందని, అనారోగ్యంతో మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కండలేరు నీటి మట్టం 56.4 టీఎంసీలు

రాపూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 56.4 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సోమశిల వరద కాలువల ద్వారా ఇన్‌ఫ్లో 180 క్యూసెక్కులుగా ఉందని, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 1145 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

కోవూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాద సంఘం ప్రధాన కార్యదర్శి పూండ్ల స్టాలిన్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పొన్నూరులో న్యాయవాది భేతాళ ప్రకాష్‌రావుపై పోలీసులు దాడి చేయడం అమానుషమన్నారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. న్యాయాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్న న్యాయవాదులపై సంఘ విద్రోహక శక్తులు దాడులు చేస్తున్నాయని చెప్పారు. న్యాయవాదులు ఐక్యంగా సంఘవిద్రోహక శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనంతరం న్యాయాధికారులకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించారు.

'ఉల్లాస్'పై దృష్టి సారించండి

పొదలకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పొదలకూరులోని 69 సెంటర్ల ద్వారా 696 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని ఏపీఎం చిన్నయ్య కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉల్లాస్‌కు సంబంధించిన బోధన పుస్తకాలను వీవోఏలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 6నెలల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాలో మండలాన్ని ముందు వరుసలో ఉంచేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లో మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్నారు. ఎంఈవో శోభనాద్రి మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ చదవడం, రాయడంతో పాటు అన్ని విషయాల్లో అవగాహన పెంపొందించుకునేలా తయారు చేయాలన్నారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు సమష్టిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, దయాకర్, శ్రీనివాసులు, ఇందిరమ్మ, సరోజ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టించాలి

- ఎస్ఐ హనీఫ్

పొదలకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోజుకో తరహాలో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ల మోసాలను ప్రజలందరూ అప్రమత్తతతో అంతమొందించాలని సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్‌కెఎస్‌డీ.హనీఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వెలుగు వీవోఏలు, సీసీలకు నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (నిక్సీ) సౌజన్యంతో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోజూ ఏదో కొత్త ప్రయోగం చేస్తూ పోలీసులమని, సీబీఐ అధికారుమని, ఈడీ, కస్టమ్స్ అధికారులమనీ ఫోన్ చేసి బెదిరించి సొమ్ము దోపిడీ చేస్తున్న సంఘటనలు ఎక్కువైపోతున్నాయన్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శోభనాద్రి, వెలుగు ఏపీఎం చిన్నయ్య, ట్రీస్ గౌరవ అధ్యక్షుడు నౌరాజ్, కార్యదర్శి అహ్మద్, రిసోర్స్ పర్సన్ ఎ.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇనమడుగు పంచాయతీ కార్యాలయంలో డీపీవో తనఖీ

కోవూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమడుగు పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్‌లో యాప్-1 నమోదు ప్రక్రియను పరిశీలించారు. పంచాయతీ సమస్యలను ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శి నాగరాజు ఆయనకు వివరించారు.

రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

వెంకటాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హత కలిగిన బీసీ, ఈబీసీ, కాపు కులాల లబ్ధిదారులు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు ఈనెల 16వ తేదీ లోపల ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మండలానికి కేటాయించిన లక్ష్యాలను బ్యాంకుల వారీగా కేటాయించారని పేర్కొన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్ పోర్టు సైజు ఫొటో, ఫోన్ నెంబరుతో ఏపీవోబీఎంఎంఎస్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు.

రాయితీ రుణాలకు 16 వరకు గడువు

- ఎంపీడీవో శైలేంద్రకుమార్

నెల్లూరు(సిటీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి రాయితీ రుణాలు పొందాలనుకునే వారు ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్ర కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 52 మందికి రుణాలు పొందే అవకాశం ఉందని, వాటిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 30, కాపు కార్పొరేషన్ ద్వారా 10, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 4, ఈబీసీ ద్వారా 3, కమ్మ 3, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఒక్కొక్కరి నుంచి దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామన్నారు. వీటిలో ఆరుగురిని జనరిక్ మందుల దుకాణాల కోసం ఎంపిక చేస్తామని తెలిపారు.

ఇల వైకుంఠం

● పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ





6లో

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయానికి ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ

→ శ్రీదేవి, భూదేవి సమేత స్వర్ణరథంపై ఊరేగుతున్న మలయప్పస్వామి

రేపు తిరుపతికి సీఎం

● నాలుగు రోజులపాటు జిల్లాలో ఉండనున్న చంద్రబాబు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ - 6లో

తిరుమలలో ఎర్రచందనం పట్టివేత

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఎర్రచందనం పట్టుబడింది. తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు శుక్రవారం వేకువజాము తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద నిఘ పెట్టారు. ఓ కారు ఉదయం 7 గంటల సమయంలో వస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. వీరిని గమనించిన ముగ్గురు స్మగ్లర్లు కారు నిలిపివేసి అడవిలోకి పారిపోయారు. ఫారెస్ట్ సిబ్బంది వారిని వెంటాడినా ఆచూకీ లభించలేదు. ఇక, కారును పరిశీలించగా 6 ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించారు. కారుతో సహా దుంగలను తొలుత తిరుమలలోని ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించి ఆతర్వాత తిరుపతికి పంపారు.

ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ

తిరుపతి (నేరవిభాగం): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును నియమించారు. ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ అయిన విషయం తెలిసిందే.

శ్రీవారి సేవలో ప్రముఖులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు


రఘురామకృష్ణరాజు


నిమ్మల రామానాయుడు


హోం మంత్రి అనిత


రామ్మోహన్‌నాయుడు


చాముండేశ్వరీనాథ్, పుల్లెల గోపీచంద్

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వారిలో.. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు అనిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారధి, నిమ్మల రామానాయుడు, సవిత, శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ రెడ్డి, గుమ్మనూరు జయరాం, బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, జగన్మోహన్, మురళిమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, శ్రీకృష్ణదేవరాయులు, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, కంచర్ల శ్రీకాంత్, కల్యాణి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ, సుహాసిని, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, సినీ నటుడులు రాజేంద్రప్రసాద్, సప్తగిరి, నిర్మాత బండ్ల గణేష్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, ఇండియన్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ ఉన్నారు.



ఇల వైకుంఠం

- పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ











శ్రీవారి ఆలయంలో దాదాపు 5 టన్నులు.. వెలుపల మరో 5 టన్నుల పుష్పాలు.. 1.20 లక్షల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణలే. విద్యుద్దీపాలంకరణలతో తిరుమల 'ఇల వైకుంఠం'గా మారింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మనసుదోచే విద్యుత్, పుష్పాలంకరణలో స్వామి కొండను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. శ్రీవారి ఆలయం ముందు వేసిన 'రంగనాథస్వామి ఆలయ' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి దర్శనం అనంతరం భక్తులందరూ ఈ సెట్టింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు. పూలు, పండ్లతో చేసిన దేవతల అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈసారి మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో అలంకరణలు చేపట్టడంతో భక్తులు నూతన అనుభూతులను పొందుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహావిష్ణువు, శ్రీలక్ష్మీదేవి, గరుడ ఇతర దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు, సప్తగిరి వద్ద విద్యుత్ సప్త ద్వారాలు కూడా శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తొలిరోజు ప్రశాంతంగా..

- శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు
- స్వర్ణరథంపై ఊరేగిన స్వామివారు.. నేడు చక్రస్నానం



తిరుమల, జనవరి10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులతో తిరుమల కొండ సందడిగా మారింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను వేకువజామున 4.30 గంటలకు మొదలుపెట్టాలని అనుకున్నప్పటికీ.. ధనుర్మాసం కైంకర్యాలు కైంకర్యాలు త్వరగా పూర్తికావడంతో 3.50 గంటలకే దర్శనాలు మొదలయ్యాయి. ఉదయం 8.15 గంటల వరకు సుప్రీం, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులకు దర్శనం చేయించారు. ఆ తర్వాత టోకెన్లు పొందిన సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ల వారీగా దర్శనం చేయిస్తామన్నారు. ఇక, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంలో వేంచేపు చేసి ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథాన్ని టీటీడీ మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు లాగారు.

మిగిలిపోయిన గదులు?

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పద్మావతి పరిధిలోని వందకుపైగా గదులు మిగిలిపోయినట్టు తెలిసింది. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజు గదుల పొందాలంటే శ్రీవారి దర్శనాని కంటే కష్టంగా భావిస్తారు. అలాంటిది శుక్రవారం ఏకంగా దాదాపు వంద గదులు ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉండిపోయినట్టు సమాచారం. వివిధ రకాల ప్రముఖుల కోసం వీటిని ఎవరికి కేటాయించకుండా వదిలేసినట్టు తెలిసింది. మరోవైపు గదులు లభించక చాలా మంది భక్తులు తీవ్రమైన చలిలో ఉండిపోయారు. కనీసం వారికైనా వీటిని కేటాయించి ఉంటే బాగుండేదంటూ పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

ఇబ్బంది పెట్టిన గేట్లు

శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన గేట్లతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఒకచోటు నుంచి మరోచోటికి వెళ్లేందుకు అవస్థ పడ్డారు. స్వర్ణరథం నిర్వహించే సమయంలో అక్కడక్కగా గేట్లను మూసివేయడంతో పిల్లలతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. వృద్ధులు, మహిళలు కూడా గేట్లను ఎక్కిదూకుతూ కనిపించారు. తిరుమలలో చలి భక్తులను గజగజ వణికించింది. శుక్రవారం మొత్తం ఎండ లేకపోవడంతో పాటు పొగమంచు ఉక్కిరిబిక్కిరి చేసింది.

రేపు తిరుపతికి సీఎం

- నాలుగు రోజులు జిల్లాలో ఉండనున్న చంద్రబాబు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పర్యటించే ప్రాంతాలను తనిఖీ చేశారు. తాజ్ హోటల్‌లో పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అప్రమత్తంగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామమోహన్ పాల్గొన్నారు. కాగా, ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు.. నాలుగు రోజులపాటు జిల్లాలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుచానూరు ముఖద్వారం (బనీన్ ఫ్యాక్టరీ) సమీపంలో శంకర్‌రెడ్డి నివాసంలో ఏజీఅండ్‌పీ గ్యాస్ సంస్థ ఇంటింటికి ఏర్పాటు చేసిన గ్యాస్ కనెక్షన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం 2.20 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని, ఏజీ అండ్‌పీ గ్యాస్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక్కడి వరకు అధికారనిక పర్యటన ఖరారైంది. కాగా, సాయంత్రం నారావారిపల్లెకు చేరుకుని పండుగ సందర్భంగా 13, 14, 15 తేదీల్లో చంద్రబాబు అక్కడే ఉంటారు. 15వ తేదీన మధ్యాహ్నం తిరుగు ప్రయాణమవుతారని అధికారులు వెల్లడించారు.

స్వగ్రామాలకు 32 మంది



వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటలో గాయపడిన వారిలో 32 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. వారికి అధికారులు శ్రీవారి దర్శనం చేయించి ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు పంపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఫొటో దిగారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ పోరాటాలు


మీడియాతో మాట్లాడుతున్న కృష్ణయ్య

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 10(ఆంధ్రజ్యోతి): బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరికి న్యాయం చేయడానికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. శనివారం తిరుచానూరులోని ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో జరిగే ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ 19వ మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జల్లి మధుసూదన్, నూకాలమ్మ, జగన్నాథం, సుగుణపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై విచారణ

- క్యూలైన్ల వద్ద ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై ప్రభుత్వం సీరియస్


క్యూలైన్ల వద్ద కానరాని వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే కారణంతో ప్రభుత్వం ఆ శాఖ అధికారులను వివరణ కోరినట్లు సమాచారం. గాయపడిన వారికి సకాలంలో వైద్య సాయం అందలేదని, ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్సు కూడా అందుబాటులో లేదని అధికారుల విచారణలో తేలింది. సాధారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు చేరే ప్రదేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలి. తప్పక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా అంబులెన్సులను అందుబాటులో ఉంచాలి. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగిందని అధికారుల విచారణలో తేలడంతో ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.

షికారీల భూసమస్యను పరిష్కరించండి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ఏర్పేడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురం షికారీ కాలనీకి చెందిన షికారీల భూ సమస్యను పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హుస్సేన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 1979లో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో తమకు ఒక్కో కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున 120 కుటుంబాలకు అందించారని షికారీల ఉద్యమనేత పరశునాథ్ చెప్పారు.20ఏళ్ల క్రితం పొట్ట కూటి కోసం పట్టణాలకు వలస వెళ్లామన్నారు. అదేదను గా భావించిన కొంతమంది రైతులు తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు షికారీల భూ సమస్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వారికి న్యాయం చేయాలని హుస్సేన్ ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీ ఎస్టీ కమిషన్ సభ్యుడు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు



గూడూరులో కోదండరామాంజనేయస్వామి గ్రామోత్సవం





సూళ్లూరుపేట: గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు - నాయుడుపేట: భీమవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం



తడలో గోపూజ



కోటలో పూజలు అందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ రాజస్వామి

గూడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే ప్రజలు ఆలయాలకు చేరుకుని ఉత్తరద్వారం నుంచి స్వామివార్లను దర్శించుకున్నారు. గూడూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి, కోదండ రామాంజనేయస్వామి, ఆళఘనాధస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. పలు ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా గరుడ వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయంలో స్వామివారిని భక్తుల దర్శనార్థం గరుడ వాహనంపై అలంకరించారు. ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు వేదపారాయణం, 6.30 గంటలకు గరుడ వాహన సేవ నిర్వహించారు. రాజగోపుర ద్వార దర్శనంలో కరిమాణిక్య స్వామి దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ తన స్వగ్రామమైన నాయుడుపేట మండలం భీమవరంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా తన మొదటి జీతంలో రూ.50వేలను ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేటలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మద్వేంకటరామ్మూర్తి స్వామి ఆలయం, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి, బాలాంజనేయస్వామి, పాండురంగ స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజ వైభవంగా జరిగాయి. మన్నారుపోలూరు సత్యా జాంబవతీ అలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయంలో పూలతో అలంకరించి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అలాగే మన్నారుపోలూరులో ప్రాచీన కాలంనాటి మన్నారుకృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి ఏడుకలు జరిగాయి. ఉదయం స్వామిని గరుడవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ఉత్తర దిక్కున నిలిపి, ఉత్తరద్వార దర్శనాలకు భక్తులను అనుమతించారు.

తడ(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం, చేనిగుంటలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయం, చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయాల్లో ముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు, గోపూజ చేశారు. అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం వ్యవస్థాపకులు తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, టీడీపీ నాయకుడు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని భూదేవి, శ్రీదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకులు ఉదయగిరి ఆదిశేషాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గూడలి పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా కోటలోని వైకుంఠ రాజస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త గ్రంథం శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అదే విధంగా గోవిందపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, శ్రీలక్ష్మమ్మకాలనీ, చిట్టేడు, వంజివాక, గ్రామాల్లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరహర క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను కన్నుల పండవగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పురవీధుల్లో గరుడ వాహనపై స్వామివారి ఊరేగించారు.

చిట్టమూరు(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని కొత్తగుంట, ఆరూరు, కోగిలి, సోమసముద్రం గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి.స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.









సూళ్లూరుపేట: మన్నారుపోలూరులోని మన్నారు కృష్ణస్వామి - వెంకటగిరి టౌన్: గరుడ వాహనంపై వైకుంఠవాసుడు - చిల్లకూరులో లక్ష్మీనరసింహస్వామి, గూడూరులో కోదండ రామాంజనేయస్వామి

పార్కింగ్ నిబంధనలు అమలు చేయండి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పక్కన కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కడ పడితే అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారని, వారిపై మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయ నూతన సమావేశ మందిరంలో చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు బందిల మహేశ్వర్, జనార్దన్ మాట్లాడుతూ శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడలకు కార్మికులను తీసుకెళ్లే బస్సులను ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. తెలిపారు. చిన్నచిన్న వ్యాపారులు రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకుంటే పన్నులు వసూలు చేసే అధికారులు మున్సిపాలిటీ స్థలాల్లో బస్సులను పార్కింగ్ చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అదే విధంగా పట్టణంలోనివీధుల్లో పశువుల సంచారం అధికంగా ఉందని, దీని వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పట్టణంలో పశువుల సంచారాన్ని అరికట్టాలని కోరారు. కాగా, కౌన్సిల్ సమావేశంలో మొత్తం 19 అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, వైస్ చైర్మన్ చిన్నసత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



దీక్ష చేపడుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గూడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాధార, ప్రమాదంలో మరణించినా మున్సిపల్ కార్మికులు ఎక్స్‌గ్రేషియా అందజేయడంతో పాటు బాధితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఇప్పటికే తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో గోపి, కోటేశ్వరరావు, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, రాజేష్, సంపూర్ణమ్మ, మణేమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలకు జీవో జారీ చేయాలి

నాయుడుపేట టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య మాట్లాడుతూ గత సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు వెంటనే జీవోను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ముకుంద, కార్మిక సంఘాల నాయకులు శ్యామలమ్మ, చంద్రకళ, రమణయ్య, జయచంద్ర పాల్గొన్నారు.

కళాశాలలో పార్కింగ్ షెడ్ ప్రారంభం



పార్కింగ్ షెడ్‌ను ప్రారంభిస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు జయరాజగోపాల్, రామమోహన్ తదితరులు

నాయుడుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాహనాల పార్కింగ్ షెడ్‌ను రోటరీక్లబ్ అధ్యక్షుడు జయరాజ గోపాల్ శుక్రవారం ప్రారంభించారు. యూఎస్ఏలోని బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ సహాయంతో మునగాల కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ పార్కింగ్ షెడ్ నిర్మించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రామమోహన్, రోటరీ క్లబ్ మెంబర్లు మునిగిరీష్, శ్యామసుందరరావు, చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి అనగానికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి సత్యప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రసాద్ నాయుడు తదితరులు

వెంకటగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో వెంకటగిరికి చెందిన పలువురు టీడీపీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి స్వగ్రామమైన రేపల్లెలో అనగాని సత్యప్రసాద్‌ను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీవీఆర్, పచ్చూరు పెంచల నరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

గూడూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని గాయత్రి పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల విశిష్టతపై విద్యార్థులకు అవగాహన పెంచేలా పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించామన్నారు. విద్యార్థులు హరిదాసులు, రైతుల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, రఫీ, సోనియా, సుప్రియ, భవానీ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



లోకేష్ మృతదేహం

వాకాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో గల్లంతైన విద్యార్థి మామిడి లోకేష్(17) మృతదేహం శుక్రవారం సాయంత్రం లభ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.... వాకాడు మండలం వైట్‌కుప్పం గ్రామానికి చెందిన విద్యార్థి మామిడి లోకేష్ స్నేహితులతో కలసి గురువారం సముద్ర స్నానానికి వెళ్లిన విషయం విధితమే. ఇద్దరు విద్యార్థులు సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోగా మత్స్యకారులు, మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం నుంచి సముద్రతీరంలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 6 గంటలకు ఓ మృతదేహం నీటిపై తేలియాడుతూ ఒడ్డుకు చేరుకోగా అది లోకేష్‌గా గుర్తించారు. నెల్లూరు జిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన కొండయ్య, రేఖ దంపతుల కుమారుడు లోకేష్ వాకాడు మండలం వైట్‌కుప్పం గ్రామంలో తన మేనమామ కుమార్ వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

తైక్వాండో క్రీడాకారుల ఎంపిక అభినందనీయం



క్రీడాకారులచే పూలమొక్కలు అందుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు ఎంపిక కావడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అన్నారు. నాయుడుపేట షాదీమందిర్‌లో శుక్రవారం తైక్వాండో కలర్ బెల్ట్ క్రీడాకారుల సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు ఉయ్యాల పవన్ కుమార్, ఎ. వినోద్‌కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ ప్రారంభం



గోకులం షెడ్ వద్ద పూజలు చేస్తున్న అధికారులు, నాయకులు

నాయుడుపేట టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరులో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్‌ను ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచు రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ నేతలు చంద్రారెడ్డి, చెంగయ్య పాల్గొన్నారు.

21 నుంచి ప్రజాసమస్యలపై పోరుబాట

పెళ్లకూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యలపై ఈనెల 21 నుంచి పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తెలిపారు. మండలంలో మద్యం బెల్ట్ షాపులు లేకుండా చేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో రోసనూరు నుంచి పోరుబాట సాగించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, తడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరపరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ మురళి తెలిపారు. అలాగే తడ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి చేయూత



వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యవసర సరుకులు నగదు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

నాయుడుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పిచ్చిరెడ్డితోపులోని జీసెస్ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి శుక్రవారం తంబిరెడ్డి మధుసూదనరెడ్డి చేయూత అందించారు. మధుసూదనరెడ్డి స్నేహితుడు, రవాణాశాఖ అధికారి ప్రభాకర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యవసర సరుకులు, నగదు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు మునిరత్నం పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ భవన్‌లో శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్యామ్‌యాదవ్, జీజీ నాయుడు, శ్రీధర్‌రెడ్డి, నాగేంద్ర, రవీంద్రరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు, దుస్తులను అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

మరణంలోనూ వీడని బంధం

భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య మృతి





సుబ్బరామయ్య, శేషమ్మ (ఫైల్‌ఫొటోలు)

కోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం కలిసి ఉంటామంటూ వివాహ బంధంతో ఒక్కటైన జంట కాటికెళ్లే సమయంలో కలిసే ప్రయాణించిన విషాదఘటన కోట మండలం తిన్నెలపూడి దళితవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని తిన్నెలపూడి దళితవాడకు చెందిన మన్నె సుబ్బరామయ్య(80), శేషమ్మ(75) దంపతులకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు ఆర్టీసీలో కండెక్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరామయ్య గురువారం స్వగ్రామమైన తిన్నెలపూడిలో మృతి చెందాడు. శుక్రవారం దహన క్రియలు నిర్వహిస్తుండగా భర్త మృతదేహంపై పడి భార్య శేషమ్మ బోరున విలపిస్తూ అశువులు బాసింది. ఈ ఘటన బంధువులు, గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య ఒకేసారి భార్యభర్తల మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

నేల బావిలో పడి రైతు మృతి



సురేష్ మృతదేహం

చిట్టమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పుచ్చ చెట్లకు పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లిన వంకా సురేష్(44) నేల బావిలో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... మండల పరిధిలోని మొలకలపూడి గ్రామానికి చెందిన సురేష్ గురువారం పుచ్చ చెట్లకు పురుగు మందు పిచికారీ చేసేందుకు పొలాల్లోకి వెళ్లాడు. నేల బావిలో నీళ్లు తెచ్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయి మృతి చెందాడు. సాయంత్రం అయినా సురేష్ ఇంటికి రాకపోవడంతో కుటంబ సభ్యులు గాలించినా ఎక్కడా కనిపించలేదు. శుక్రవారం నేల బావి దగ్గరకు వెళ్లి చూడగా నీళ్లలో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సాధికార కేంద్రం ప్రారంభం

కోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్‌రోడ్డులో ప్రకృతి వ్యవసాయ విభాగానికి సంబంధించి రైతుసాధికార కేంద్రాన్ని సహాయ వ్యవసాయ అధికారి దినేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సాధికార కేంద్రం ద్వారా గూడలి, చంద్రశేఖరపురం, చెందోడు, రాజుపాళెం గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, భాగ్యమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.